ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



బహిరంగ సభ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

లక్‌పతి దీదీలు అంతంతే!



ఏడాదికి రూ.లక్ష ఆర్జిస్తున్న మహిళలు కొందరే!

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా రాష్ట్రంలో ఇటీవల సర్వే నిర్వహించింది. వివిధ స్వయం ఉపాధి వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్న పొదుపు సంఘాల మహిళల్లో ఏడాదికి అన్ని ఖర్చులూ పోను ఎంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలుసుకోవడమే ఈ సర్వే లక్ష్యం. ఏటా రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం ఉన్న సంఘాల సభ్యులను గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'లక్‌పతి దీదీ' అనే పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. మహిళా పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ఈ సర్వే నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 4,05,075 మంది పొదుపు సంఘాల మహిళలుండగా వారిలో 3,95,094 మంది ఈ సర్వేలో తమ అభిప్రాయాలను తెలియజేశారు. కాగా ఏడాదిలో లక్ష సంపాదన ఉన్న మహిళలు 24శాతం లోపే ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. ఇలాంటి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేకుండా రూ.5లక్షల వరకు రుణం ఇవ్వడం, ప్రభుత్వ సంస్థల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించడం వంటి ప్రోత్సాహకాలను కేంద్రం అమలు చేస్తోంది.



- మేడ్చల్‌లో 30శాతం
- వికారాబాద్‌లో 22శాతం
- రంగారెడ్డి జిల్లాలో 17శాతం ఉన్నట్టు గుర్తింపు
- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ సర్వేలో వెల్లడి
- స్వయం సహాయక, పొదుపు సంఘాల సభ్యులపై పరిశోధన.. పేద మహిళలకు ఆర్థిక చేయూతే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24): దేశంలో గ్రామీణ మహిళల ఆర్థికాభ్యున్నతికి కొత్తగా అమల్లోకి తెచ్చిన 'లక్‌పతి దీదీ' పథకాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద పొదుపు సంఘాల మహిళలు ఏడాదికి అన్ని ఖర్చులూ పోనూ రూ.లక్ష ఆదాయం సంపాదించేందుకు కేంద్రం ఆర్థిక సహాయంతో పాటు వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వనుంది. దేశంలో రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా చేసే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, తదితర పథకాల కింద ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల రుణాలు అందచేస్తున్న విషయం తెలిసిందే. ఇలా రుణాలు తీసుకున్న మహిళలు వివిధ రకాల వ్యాపారులు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.అయితే ఈ పథకం అమల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి? వారి ఆర్థిగ ఎదుగుదల ఎలా ఉంది? పొదుపు సంఘాల్లో చేరక ముందు, ఆ తరువాత వచ్చిన మార్పులు ఏమిటీ? ఆర్థిక సమస్యలను ఎలా పరిష్కరించుకుంటున్నారు? అనేది తెలుసుకునేందుకు ఇటీవల జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ సర్వే నిర్వహించింది. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన రుణాలతో ఎంత మంది మహిళలు లక్షాధికారులుగా మారారు? రుణాలు తీసుకున్న వారిలో ఆర్థికాభివృద్ధి సాధించని వారెందరు? ఇందుకు గల కారణాలు ఏమిటనేదానిపై సర్వే చేశారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో 4,05,075 మంది పొదుపు సంఘాల మహిళలు ఉండగా వీరిలో 3,95,094 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. అనేక అంశాలపై జరిగిన ఈ సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కేంద్రం ప్రారంభించనున్న 'లక్‌పతి దీదీ' పథకం అమలుకు ముందే ఉమ్మడి జిల్లాలో పొదుపు సంఘాల ద్వారా లబ్ధిపొందిన 78,678మంది మహిళలు ఏడాదికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకు పైగా సంపాదిస్తున్నట్లు తేలింది. ఇక జిల్లాల వారీగా చూస్తే మేడ్చల్ జిల్లాలో 30శాతం మంది, వికారాబాద్ జిల్లాలో 22శాతం మంది, రంగారెడ్డి జిల్లాలో 17శాతం మంది 'లక్‌పతి దీదీ'లు ఉన్నారు. కాగా ఏడాదికి రూ.61వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. లక్‌పతి దీదీల సంఖ్య రాష్ట్ర సగటు 24శాతం కాగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఇది రాష్ట్ర సగటు కంటే తక్కువగావే ఉంది.

జిల్లా	మొత్తం పొదుపు మహిళల సంఖ్య	సర్వేలో పాల్గొన్న మహిళలు	రూ.25వేల లోపు ఆదాయం	రూ.25వేల నుంచి 60వేల ఆదాయం	రూ.61వేల నుంచి లక్ష వరకు	రూ.లక్షకు పైగా ఆదాయం	లక్ష లోపు ఆదాయ శాతం
రంగారెడ్డి	2,11,492	2,06,505	11,512	73,797	86,843	34,353	17
మేడ్చల్-మల్కాజ్‌గిరి	34,537	32,843	1,359	6,739	14,756	9,989	30
వికారాబాద్	1,59,046	1,55,746	9,787	60,604	51,019	34,336	22

'లక్‌పతి దీదీ' పథకం అంటే ఏమిటీ?

వాస్తవానికి ఈ పథకాన్ని తొలుత రాజస్థాన్‌లో ప్రారంభించారు. గ్రామీణ మహిళల సాధికారిత దిశగా అమల్లోకి తెచ్చారు. పొదుపు సంఘాల్లో పనిచేస్తున్న గ్రామీణ మహిళలు ఒక ఏడాదిలో అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకుపైగా సంపాదించేందుకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తోంది. జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా మహిళలను లక్షాధికారులను చేసే ఈ స్కీమ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఈ పథకం అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎల్ఆర్ఎల్ఎం) ద్వారా ప్రతి మహిళ రూ.లక్ష ఆదాయం ఆర్జించేలా అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించడంతో పాటు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇస్తున్నారు. నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చిన అనంతరం మహిళలకు వడ్డీ లేకుండా రూ.5లక్షల వరకు రుణం ఇవ్వనుంది. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది మహిళలను లక్‌పతిదీదీలుగా చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేసింది. ప్రభుత్వం ద్వారా వడ్డీ లేని రుణ ఈ పథకం ద్వారా మహిళలు అన్ని రకాల వ్యాపారులను చేసుకునేందుకు వీలుంది. ఆర్థిక క్రమశిక్షణతో ఎదిగిన పొదుపు సంఘాలను గుర్తించి వారికి మరింత రుణ సదుపాయాన్ని అందించనున్నారు.



చేవెళ్ల బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

- పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు
- సభ నిర్వహణపై అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్ష

చేవెళ్ల, ఫిబ్రవరి 24: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఈ నెల 27న చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శశాంక, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషార్రఫ్ అలీ, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు శనివారం పరిశీలించారు. కలెక్టర్ శశాంక సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 27న చేవెళ్లలో సాయంత్రం ఫరా ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సీఎం సభ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేయనున్న 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనుంది. ఇందు కోసమే ఇక్కడ భారీ బహిరంగ సభకు ప్రభుత్వం తలంచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీని ఆహ్వానించారు. కాగా సభకొచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ స్థలం ఏర్పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీస్ శాఖ చూసుకోవాలని స్పష్టం చేశారు. గృహజ్యోతి(ఉచిత కరెంట్) పథక లబ్ధిదారులను ముందుగానే ఎంపిక చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆయన సూచించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీకి లబ్ధిదారుల ఎంపికను పౌర సరఫరాల శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. సభకొచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను శశాంక ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో పీడీ శ్రీలత, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్, ఏడీఏ స్వామి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, ఏసీపీ బంటు కిషన్, సీఐ లక్ష్మారెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, ఏఈలు జానీమొయినుద్దీన్, చంద్రశేఖర్, ఆర్ఐ రాజేశ్, ఆయా శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

భారీగా జన సమీకరణ చేయాలి : వేం నరేందర్‌రెడ్డి

ఈ నెల 27న చేవెళ్లలోని గల ఫరా ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ శనివారం రాత్రి పరిశీలించారు. సభా ప్రాంగణంలో కలియ తిరిగి అక్కడే ఉన్న కలెక్టర్ శశాంకను సభఏర్పాట్లపై వివరాలను నరేందర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండు పథకాలను(200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్) చేవెళ్లలో సభలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ప్రభుత్వం నిర్వహించే సభకు భారీగా జన సమీకరణ చేయాలని నరేందర్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు, స్థానిక నాయకులకు సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, నాయకులు వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.



సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

మూడో బెటాలియన్ నూతన భవనాల ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24: ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ మూడో బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన ఆయుధ గార బ్యారక్, క్యాంటీన్ భవనాలను శనివారం అదనపు డీజీపీ(హైదరాబాద్ టీఎస్ఎస్పీ బెటాలియన్స్) స్వాతీ లక్రా, అదనపు డీజీపీ విజయ్‌కుమార్, ఐజీపీ రమేష్‌రెడ్డిలు ప్రారంభించారు. ఇంకా నిర్మాణంలో ఉన్న పలు విభాగాల భవనాలను త్వరగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీ ఐజీ సిద్ధిఖీ, 3వ బెటాలియన్ కమాండెంట్ వేణుగోపాల్, సీఈ తులసీదాస్ పాల్గొన్నారు.



3వ బెటాలియన్‌లో ఆయుధ గారాన్ని ప్రారంభిస్తున్న అదనపు డీజీపీలు స్వాతీలక్రా, విజయ్‌కుమార్ తదితరులు

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి

మహేశ్వరం, ఫిబ్రవరి 24: క్రీడలతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందడంతో పాటు, సమాజంలో గుర్తింపు లభిస్తుందని చిన జీయర్‌స్వామి అన్నారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు సరూర్‌నగర్‌లోని జీఎస్ఆర్ గ్రౌండ్‌లో యువ వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శనివారం శంషాబాద్ మండలంలో గల ముచ్చింతల్‌లోని చినజీయర్ స్వామి ఆశ్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి గల క్రీడలపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను, పీడీ, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. జోన్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు ద్వితీయ స్థానంలో నిలిచి చినజీయర్ నుంచి బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉందని పాఠశాల సిబ్బంది అన్నారు.



మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చిన జీయర్‌స్వామి, తదితరులు

భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ఈ నెల 28న కలెక్టరేట్ ముట్టడి

కందుకూరు, ఫిబ్రవరి 24 : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల నెట్‌చార్జీలు, వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం భోజన కార్మికులతో కలిసి ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వండుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు, బిల్లులు సకాలంలో మంజూరు చేయడం లేదని విమర్శించారు. జిల్లాలోని అన్ని మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కె.శ్రీనివాస్, లావణ్య, శోభ, అండాలు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

మహేశ్వరంలో బీఆర్ఎస్‌కు.. భారీ షాక్!

- కాంగ్రెస్‌లోకి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- ఎమ్మెల్సీ పట్నం, మాజీ ఎమ్మెల్యే తీగలతో కలిసి సీఎంతో భేటీ
- ప్రియాంకాగాంధీ సమక్షంలో త్వరలో హస్తం పార్టీలో చేరిక

మహేశ్వరం, ఫిబ్రవరి 24: రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ పరిణామం మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతల్లో ప్రకంపనలు రేకెత్తిస్తోంది. సంవత్సర కాలంగా తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. తాజాగా ముఖ్యమంత్రిని తీగల కుటుంబం కలవడంతో ఆ వార్తలు నిజమయ్యేలా కన్పిస్తున్నాయి. కాగా ఈ మధ్యనే వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి-మహేందర్‌రెడ్డి దంపతులు, వారి కుమారుడు సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సీఎంను మర్యాదపూర్వకంగా కలవడంతో జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీషాక్ తగిలినట్టేననే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన తీగల కృష్ణారెడ్డి గతంలో హైదరాబాద్ మేయర్‌గా, మహేశ్వరం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో మహేశ్వరం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెల్చిన ఆయన అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సబితారెడ్డి చేతులో కృష్ణారెడ్డి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం సబితారెడ్డి కూడా సైతం బీఆర్ఎస్‌లో చేరడంతో వారి మధ్య వర్గ విభేదాలు పొడసూపాయి. తమకు పార్టీలో గుర్తింపు లభించడంలేదని పలుమార్లు తీగల.. కేటీఆర్, కేసీఆర్‌లతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఎమ్మెల్సీ పదవిస్తానని కేసీఆర్ మాట తప్పారని, మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని తీగల తన అనుచరగనంవద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే పార్టీ మారేందుకు కృష్ణారెడ్డి సిద్ధం కాగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆయన కోడలు అనితారెడ్డి అడ్డుకున్నారనే వార్తలొచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్‌లతో కృష్ణారెడ్డి సన్నిహితంగా ఉండడం బీఆర్ఎస్‌కు మింగుడు పడలేదు. ఇదే తరుణంలో మామ, కోడలు కృష్ణారెడ్డి, అనితారెడ్డిలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలవడం నియోజకవర్గ బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బే! కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకాగాంధీ సమక్షంలో తాము కాంగ్రెస్‌లో చేరుతాం అని అనితారెడ్డి చెప్పడంతో తీగల కుటుంబం కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. మహేశ్వరంలో బీఆర్ఎస్‌కు ఊహించని దెబ్బలు తగులుతున్నాయి. మరికొందరు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సైతం కాంగ్రెస్ చేరతారనే వార్తలొస్తున్నాయి. టీడీపీలో రేవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి కలిసి పనిచేయడం కూడా కాంగ్రెస్‌లో చేరేలా చేసింది. ఒక్కొక్కరుగా పార్టీ వీడుతుండడంతో బీఆర్ఎస్‌కు బీటలు వారే పరిస్థితి ఏర్పడుతోంది.




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 237 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37పోలీస్ స్టేషన్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాచ్, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల సమీపంలో గల జిరాక్స్ కేంద్రాలను రోజూ పరీక్ష అయిపోయేంత వరకూ మూసి ఉంచాలని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులను, ఆశా వర్కర్ ఏఎన్ఎంలను, అందుబాటులో ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. ఫర్ని చర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయానుకూలంగా బస్సు సర్వీసులు వేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షల సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయానికి ప్రశ్నపత్రాలను ఎగ్జామ్ సెంటర్లకు చేర్చాలన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోకునేలా చూడాలన్నారు.ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని తెలిపారు. అధికారుల దరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో డీఐఈవో శ్రీదేవి, డీఈవో సుశీందర్ రావు, పోలీసు, ఆరోగ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 195 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 74,875 మంది, రెండో సంవత్సరంవిద్యార్థులు 74,191 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37 పోలీస్ స్టేషన్లను గుర్తించామన్నారు. పరీక్ష కేంద్రాల తనిఖీకి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా చేయాలన్నారు. సమావేశంలో డీఐఈవో శ్రీదేవి, డీఈవో సుశీందర్‌రావు, పోలీసు, ఆరోగ్య శాఖల, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డీఏవీ విద్యార్థుల ఎంపిక

తాండూరురూరల్, ఫిబ్రవరి 24 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాండూరు మండలంలోని కరన్‌కోట్ సీసీఐ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏసురత్నం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న తాండూరులోని పాత శాలివాహన డిగ్రీ కళాశాలలో అండర్-17, 16, 14 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు జరుగగా పాఠశాలకు చెందిన విద్యార్థులు కరణ్‌జాదవ్‌ఓవి, సరితకుమారి, గాయత్రి రన్నింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదివారం (ఈ నెల 25) నుంచి హైదరాబాద్ కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ చైర్మన్, జీఎం మహాన, ఆర్వో శేషాద్రి, పీఈటీ మహాదేవ్ అభినందించారు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కందుకూరు : వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని పులిమామిడి గ్రామంలోని చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బుక్క ప్రశాంతిపాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంధ్యాదామోదర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీ రాజమ్మ, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

కొందుర్గు : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల


యాచారం : వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పరిధిలోని టేకులపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, కోయల నర్సింలు, పురుషోత్తంరెడ్డి, మల్లేష్, పహిల్వాన్, అంజిరెడ్డి, అశోక్, శ్రీను, ఆగమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

యాచారం : తక్కళ్లపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిసాయి. స్వామివారికి అభిషేకాదులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని రథంపై ఊరేగించారు. చివరి రోజు భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టీ, మెంబర్ కె.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

కొందుర్గు : మండల కేంద్రంలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శివస్వాములు భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి భూపాలాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసరి సత్యనారాయణ, భరత్, కె.రాములు గౌడ్, సుధాకర్, అనిల్‌గౌడ్, వెంకటయ్య, శివ, రాములు, వెంకటేష్, శ్రీనివాస్, అమర్, లింగం, రామస్వామి, కృష్ణయ్య, యాదగిరి తదితరులున్నారు.


కొందుర్గు : పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి భూపాలాచారి, తదితరులు

ఎల్కగూడ గ్రామంలో..

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడ గ్రామం శివనామస్మరణంతో మార్మోగింది. శనివారం గురుస్వాములు కమ్మరి భూపాలచారి, కొండి యాదయ్య ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. స్వాములు శివలింగానికి అభిషేకం, జ్యోతిర్లింగాల పడి మెట్ల పూజ నిర్వహించారు.


కేశంపేట : వేంకటేశ్వర స్వామి-పద్మావతిల కల్యాణం జరిపిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

తలకొండపల్లి : ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని డిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. మండలంలోని వెల్జాల వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆహ్వాన పత్రికను శనివారం గ్రామ నాయకులు హైదరాబాద్‌లోని మల్లు నివాసంలో అందజేశారు. అనంతరం ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు, అజీజ్, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం

కేశంపేట : మండల పరిధిలోని పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి గ్రామ శివారు గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి- పద్మావతి అమ్మవార్ల కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల వెంట ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో విగ్రహాలను ఉంచారు. కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లికి చెందిన సూరం శ్రీనివాస్-కవిత, గుబ్బ అనిల్‌కుమార్- సుమలత, కంచుకోట రమేష్-స్రవంతి, కుమ్మరి నర్సింలు-అనురాధ దంపతులు కల్యాణాన్ని పండితులు విక్రం, తిరుమలచారి, ప్రమోద్ మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. పల్లె బ్రదర్స్ ఆనంద్‌కుమార్, బాలీశ్వర్, పోమాల్‌పల్లి మాజీ సర్పంచ్ కృష్ణయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

కడ్తాల్ : కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కడ్తాలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన, సహస్ర పారాయణం, హోమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగడ్‌పల్లిలో మహా పడిపూజ

చేవెళ్ల : మండల పరిధిలోని తంగడ్‌పల్లిలో శివప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాలయం సన్నిధానంలో స్వాములు గణపతి పూజతో ప్రారంభించి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. దాంతో గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చేవెళ్ల : పడిపూజలో శివస్వాములు, భక్తులు

‘టీకా’ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూర్, ఫిబ్రవరి 24: పశువుల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న టీకా శిబిరాలను గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. మండల పరిధిలోని తీగాపూర్‌లో శనివారం గొర్రెల బొబ్బరోగ నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. దాదాపు 500 గొర్రెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీలత, రవి, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.


గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి స్ఫూర్తి

సంత్ రవిదాస్ మార్గం అనుసరణీయం


రవిదాస్‌కు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 24 : సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ జీవితం అందరికీ అనుసరణీయమని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ అన్నారు. పట్టణంలో శనివారం సంత్ రవిదాస్ జయంతి వేడుకలు ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ప్రజా సంఘాల, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పుల నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు బోయినపల్లి కృష్ణ, శ్రీశైలం యాదవ్, చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ, శ్రీకాంత్ సింగ్, రాజు, శ్రీకాంత్, గణేశ్, మల్లేశ్, భరత్, నిరంజన్, ఆనంద్, శివ, జానయ్య, కొప్పు కృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ శనివారం కలెక్టర్ శశాంకను చేవెళ్లలో మర్యాదపూర్వంగా కలిశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా రవాణశాఖ అధికారి ప్రవీణ్‌రావు రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్లలో 27న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేసిన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



అనుమతి లేని నిర్మాణాల పనులు నిలిపివేత

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై శనివారం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ బాలకృష్ణ ఆదేశాల మేరకు సిబ్బంది అక్రమ నిర్మాణాల పనులను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలకు ఉపయోగించే స్టీల్, తదితర సామగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.


నిర్మాణ సామగ్రిని మున్సిపల్ కార్యాయానికి తరలిస్తున్న సిబ్బంది

మల్లు రవికి ఎంపీ టికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న జంగయ్య, కేశవులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 24: మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ నిస్వార్థంగా పని చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవికి నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను ఇవ్వాలని పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వస్పుల జంగయ్య, పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు గుర్రం కేశవులు కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు కోసం మల్లు రవి విశేషంగా కృషి సలిపారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదవులు ఉన్నా, లేకపోయినా నిరంతరం మల్లు రవి ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి అండగా ఉంటూ పార్టీలో సమస్య ఉన్న ప్రతీచోట పెద్దన్న పాత్ర పోషించారన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయ పరుస్తూ విభేదాలకు తావులేకుండా పార్టీని ముందుకు నడపడంలో మల్లు రవి క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. ఎంపీ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం, సీఎం రేవంత్ సరైన నిర్ణయం తీసుకుపోవాలన్నారు. ప్రజాభిమానం కలిగిన రవికి టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి ఔదార్యం..
పెన్షనర్ల సంఘానికి రూ.1.5లక్షలు అందజేత



షాద్‌నగర్, ఫిబ్రవరి 24 : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన మొదటి నెల జీతాన్ని పెన్షనర్ల సంఘానికి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల పెన్షనర్ల సమావేశానికి హాజరైన ఆయన.. రిటైర్డ్ ఉద్యోగులు సభలు, సమావేశాలు జరుపుకోవడానికి నిధుల కొరత రాకుండా ఉండేందుకు తన మొదటి నెల జీతాన్ని పెన్షనర్ల సంఘానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన హామీ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు సరాపు జగదీష్, రామారావు, జనార్ధన్‌కు రూ.లక్షా50వేల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్లు తనకు సన్మానం చేసిన రోజున వారి కష్టనష్టాల గురించి తెలుసుకున్నానని అందుకే తాను సహాయం అందజేశానని తెలిపారు.

‘గోకార్ట్ డిజైన్ చాలెంజ్’లో గురునానక్ విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 : ఇటీవల కోయంబత్తూర్‌లో జరిగిన 11వ జాతీయ స్థాయి గో కార్ట్ డిజైన్ చాలెంజ్ ఈవీ అండ్ సీవీ సెగ్మెంట్‌లో ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల మెకానికల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. క్యారీ మోటార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఎలక్ట్రిక్ వేరియంట్‌లో 23 కళాశాలల విద్యార్థులు పాల్గొనగా గురునానక్ విద్యార్థులు మూడోస్థానంలో నిలిచారు. అలాగే కమర్షియల్ వేరియంట్ (సీవీ) సెగ్మెంట్‌లో 44 కళాశాలలు పాల్గొనగా 6వ స్థానంలో నిలిచి తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో యాజమాన్యం విద్యార్థులను అభినందించింది. వైస్‌చైర్మన్ జీఎస్ కోహ్లీ ఆవిష్కరణలకు సహకరిస్తున్న అధ్యాపకులను అభినందించారు. ఎండీ డా.హెచ్ఎస్ సైనీ, డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారధి, ఆర్అండ్‌డీ డీన్ డా.సంజీవ్ శ్రీవాస్తవ, మెకానికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డా.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి


షాబాద్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

షాబాద్, ఫిబ్రవరి 24 : ఆరోగ్యంపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో దామోదర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందూస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామానికి చెందిన 200 మందికి షుగర్, బీపీ, థైరాడ్, క్యాన్సర్, కిడ్నీ, తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇందూస్ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వైద్యులు శ్రీనివాస్, సిహెచ్‌వో గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది శ్యాం, శంకర్, గోపాల్, శ్రీధర్ తదితరులున్నారు.

గురుకులంలో వైద్యశిబిరం నిర్వహించాలి : ఎంపీపీ

కందుకూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రతి రెండు నెలలకోసారి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీపీ మంద జ్యోతి మండల వైద్యాధికారులను కోరారు. శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక సమక్షంలో ఆ గురుకుల పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురైనా వారికి వైద్యపరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ఉపాధ్యాయ బృందంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు.

‘అవేర్’ సేవలు అభినందనీయం


శిబిరాన్ని పరిశీలిస్తున్న కసిరెడ్డి, సత్యనారాయణ

మహేశ్వరం, ఫిబ్రవరి 24 : అవేర్ సంస్థ సేవలు అభినందనీయమని, గ్రామీణ ప్రాంత పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి, మానకొండూరు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణలు అన్నారు. శనివారం తుమ్మలూరు రెవెన్యూలోగల అవేర్ భగవతిపురంలో అవేర్ సంస్థ వ్యవస్థాపకులు మాధవన్ జీతో కలిసి ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 865 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగారెడ్డి, ప్రతినిధులు రాజవర్ధన్, రమాకాంత్‌శర్మ, రామయ్య, వరుణ్, వెంకట్‌రెడ్డి, తరుణ్, నాగేశ్వర్‌రావు, వెంకన్నలతో పాటు గ్లోబల్, కామినేని, అంకిత్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీడీపీవో


మాట్లాడుతున్న చేవెళ్ల సీడీపీవో శోభారాణి

చేవెళ్ల, ఫిబ్రవరి 24 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీడీపీవో శోభారాణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులు-ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్-1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, అధికారులు శ్రీలక్ష్మి, శేఖర్, ఉపాధ్యాయులున్నారు.

సంక్షిప్తంగా..

● **చేవెళ్ల** : విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. మండల కేంద్రంలోని స్కూల్లో విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గోపాలచారి, రామగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు, అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన అంబటి రమేశ్ చేయూతనందించారు. ఆలయంలో చైర్మన్ రాజ్‌కుమార్ రెడ్డికి రూ.50 వేల విరాళం ఇచ్చారు.

● **కడ్తాల్** : పంటల సాగులో రైతులు తగిన మెళకువలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత కోరారు. చల్లంపల్లిలో శనివారం ఏవో శ్రీలత పర్యటించారు. పలువురు రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలించారు.

● **తలకొండపల్లి** : యాసంగిలో 6వేల ఎకరాల్లో వరి సాగు చేయడం జరిగిందని ఏవో రాజు తెలిపారు. రాంపూర్‌లో వరి సాగు, సస్యరక్షణ చర్యలపై శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

● **ఆమనగల్లు** : పట్టణంలోని లిటిల్ టాలెంట్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు ముచ్చట గొలిపింది. సాయంత్రం పాఠశాల ఆవరణలో పాఠశాల చైర్మన్ అల్లాజీ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎస్సై బాల్‌రామ్ నాయక్ హాజరై బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.

● **శంషాబాద్** : మున్సిపల్ కేంద్రంలోని ఏకేటౌన్ షిప్ కాలనీలోని సమస్యలను శనివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కాలనీలో డ్రైనేజీ నీరు ప్రవహించి దుర్గంధం వ్యాపిస్తుందని తెలిపారు. పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు నరేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ పీఎన్ సంజయ్‌యాదవ్‌తో పలువురు నాయకులు ఏకే టౌన్‌షిప్ కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ సమస్యలపై మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు.

క్రైం కార్నర్

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం


ఇంట్లో నుంచి వస్తున్న దట్టమైన పొగ

కొందుర్గు, ఫిబ్రవరి, 24: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఆజం మౌలానా మండల కేంద్రంలోని మసీదులో పనిచేస్తున్నాడు. అతడి భార్య ఓ పరిశ్రమలో కూలీగా పనిచేస్తోంది. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. దాంతో పక్కింటి వారు మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఇల్లు మొత్తం మంటలు అంటుకొని పొగ దట్టంగా అలుముకుంది. ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లు ఉండడంతో, పెద్ద ప్రమాదం జరిగిందని అంతా భావించారు. చుట్టుపక్కల వారు తమ ఇళ్లలో నుంచి నీటిని తెచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. కానీ, మంటలు అదుపులోకి రాలేదు. బోరు మోటరు నీటితో మంటలను అదుపు చేశారు. బట్టలు, వంట సామగ్రి, 2 బియ్యం బస్తాలు, బీరువా, ఫ్రిడ్జ్ కాలిపోయాయి. విలువైన ఆస్తిపత్రాలు కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆజం కోరారు.

వ్యభిచారం కేసులో ముగ్గురు రిమాండ్

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకున్న కేసులో ఆదిబట్ల పోలీసులు శనివారం వారిని రిమాండ్‌కు తరలించారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌కు చెందిన సామ జయశ్రీ నాదర్‌గుల్ గ్రామంలో కొంత కాలంగా వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. పక్కా సమాచారంతో శుక్రవారం పోలీసులు దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈమేరకు శనివారం సామ జయశ్రీతో పాటు విటులు మహేశ్వరం గ్రామానికి చెందిన టింగ్లీకర్ రామోజీ, రావిరాలకు చెందిన చెట్యారి శ్రీధర్‌రెడ్డిలను విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిషేధిత ఇంజక్షన్లు విక్రయం.. వ్యక్తిపై కేసు

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు విక్రహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 210 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధి నాదర్‌గుల్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఆదిబట్ల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గేదెలు, ఆవులు పాలు అధికంగా ఇవ్వడానికి వినియోగించే అనుమతిలేని ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇంతియాజ్ అనే వ్యక్తి నాదర్‌గుల్‌లోని మహేందర్‌రెడ్డి, దినేష్ అనే రైతులకు విక్రహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్వోటీ, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. అతడి నుంచి 210 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక ఆత్మహత్య

యాచారం, ఫిబ్రవరి 24 : ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక ఓ బాలిక ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం యాచారం మండలంలో జరిగింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులమైలారానికి చెందిన ఓ బాలిక(14) కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇదే గ్రామానికి చెందిన బాలిక క్లాస్‌మేట్ ఆమెను కొన్ని రోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. గమనించిన బాలిక తల్లితండ్రులు బాలుడిని మందలించారు. అయినా అతడు బాలిక వెంట పడటం మానలేదు. ఇంటి చుట్టూ తిరుగుతూ వేధించేవాడు. బాలుడితో పాటు అతడి మరో ఇద్దరు మిత్రులు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికను వేధిస్తున్నారు. వీరి వేధింపుల భరించలేక బాలిక శుక్రవారం సాయంత్రం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుందని ఎస్సై పి.నరేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు ఆయన చెప్పారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● మద్యం మత్తులో సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను హతమార్చిన నలుగురు

చేవెళ్ల, ఫిబ్రవరి 24 : మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు అర్ధరాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పడుకోవడానికి వెళ్లగా.. వద్దని వారించిన ఆపరేటర్‌ను దారుణంగా హతమార్చిన కేసును పోలీస్‌లు ఛేదించారు. ఈమేరకు హత్యచేసిన నలుగురు నిందితులను చేవెళ్ల పోలీస్‌లు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన సాగర్‌సింగ్ మండల పరిధిలోని ఆలూర్‌లో చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అదే దేశానికి చెందిన సాగర్ స్నేహితులు బినోద్ తాప, రమేశ్ ధమీ, ఉమేష్ భగవాన్‌జీలు ఈనెల 21న సాగర్ వద్దకు కలవడానికి వచ్చారు. రాత్రి దుకాణం మూసిన తర్వాత వారందరినీ యజమాని శ్రీనివాస్ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో పడుకోమని చెప్పడంతో.. ఆపరేటర్ హర్యానాయక్ అనుమతి ఇవ్వడంతో రాత్రి అక్కడే పడుకున్నారు. మరుసటి రోజు ఈనెల 22న మధ్యాహ్నం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మూసివేసిన అనంతరం ఆ నలుగురు స్నేహితులు కల్లు, మద్యం సేవించారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. అయితే, ఆపరేటర్ హర్యానాయక్ సబ్‌స్టేషన్‌లోకి రావద్దని వారించాడు. దాంతో వారి మధ్య మాటా మాటా పెరగడంతో ఆపరేటర్ హర్యానాయక్‌పై కర్రలతో దాడి చేశారు. అతడు కిందపడిపోగానే తలపై బండరాళ్లతో బాదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు వెంటనే వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల విద్యుత్ ఏఈ జానీమొయినుద్దీన్ ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీస్‌లు బృందాలుగా ఏర్పడి హత్యకు పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఈమేరకు వారిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సైలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

చేవెళ్ల పోలీస్‌లకు సీపీ అవినాష్ మహంతి అభినందన

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న హర్యానాయక్‌ను అతిదారుణంగా హత్యచేసిన కేసును కొద్ది గంటల్లోనే ఛేదించడంతో పాటు నిందితులను రిమాండ్‌కు తరలించారు. దాంతో కేసును వేగంగా ఛేదించడంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌లు పోలీస్‌లను అభినందించారు.

రన్నింగ్ బస్సునుంచి కిందపడి వ్యక్తి మృతి

● ఎక్కువ మంది ఉండడంతో ఫుట్‌బోర్డుపై నిల్చున్న ప్రయాణికుడు
● పట్టు తప్పడంతో కిందపడిన వైనం.. తలకు తీవ్రగాయాలై దుర్మరణం

ఆదిబట్ల, ఫిబ్రవరి 24 : రన్నింగ్ బస్సులో నుంచి కిందపడి తలకు బలమైన గాయాలు కావడంతో ఓ ప్రయాణికుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన నదిరి రమేష్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. తుర్కయాంజాల్‌లో పని ముగించుకొని శనివారం సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 07యూకే 4885)లో బయలుదేరాడు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో ముందు డోర్ వద్ద ఫుట్‌బోర్డుపై నిల్చున్నాడు. అయితే, బస్సు తుర్కయాంజాల్ నుంచి బయలుదేరి కొద్దిదూరం పోగానే పట్టు తప్పడంతో కింద పడిపోయాడు. దాంతె తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దాంతో రమేష్(36) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘రైతుల డిమాండ్లను నెరవేర్చాలి’

చేవెళ్ల, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై కాల్పులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం రైతుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసన, ర్యాలీపై భద్రతా బలగాలు, పోలీస్‌లు టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్ల వర్షం కురిపిస్తూ దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. రైతు నాయకుడు శుభకరంసింగ్ మృతి పట్ల న్యాయబద్ధంగా విచారణ చేయాలన్నారు.